క్లుప్తంగా

స్పీకర్‌ను కలిసిన 'పాల్వాయి'



స్పీకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం హైదరాబాద్‌లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులును, అంతకుముందు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎంను కలిసిన రావి శ్రీనివాస్



సీఎం రేవంత్‌రెడ్డితో రావి శ్రీనివాస్

కౌటాల: హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని సిర్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఎన్నికల్లో రావి శ్రీనివాస్ ఓటమికి గల కారణాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దహెగాం: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

భీమన్న దేవుడికి పూజలు

జన్నారం: మడావి వంశస్థుల కులదైవం భీమన్న దేవుడికి తిర్యాణి మండలం డోలి జండగూడ గ్రామానికి చెందిన మడావి వంశస్థులు ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజులుగా కాలినడకన డోలి జండగూడ నుంచి బయలుదేరిన వారు సోమవారం ఉదయం జన్నారం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ కొలాంగూడకు చేరుకున్నారు. అక్కడ ఆదిమ కొలాం జాతి మడావి సంప్రదాయం ప్రకారం కొత్తకోడళ్ల పరిచయ కార్యక్రమం చేశారు.

కార్మికుల సహకారంతో హక్కులు సాధిస్తాం

రెబ్బెన: సింగరేణి కార్మికుల సహకారంతో కార్మికుల హక్కులు సాధిస్తామని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో ఐఎన్‌టీయూసీ నాయకులు కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు మాధవకృష్ణ, సంజీవరెడ్డి, నారాయణ, రమేశ్, ఫర్వేజ్, భాస్కర్, ఆనంత్ కుమార్, స్వామి, శ్రీనివాస్, తిరుపతి, కృష్ణమూర్తి, చిన్నయ్య, అనిల్‌కుమార్, సూర్యనారాయణ, మల్లేష్, సతీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలు బెల్లంపల్లి రీజియన్ జట్లు

రెబ్బెన: కొత్తగూడెంలో ఆదివారం జరిగిన కంపెనీ స్థాయి అధికారుల క్రికెట్ పోటీల్లో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజేతగా నిలిచింది. క్రీసెట్ 2023–24 సంవత్సర క్రీడల్లో భాగంగా జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా బెల్లంపల్లి రీజియన్ జట్లు చాంపియన్‌లుగా నిలిచాయి. విజేతగా నిలిచిన జట్ల క్రీడాకారులను సంస్థ సీఎండీ బలరాం ప్రత్యేకంగా అభినందించినట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు.

కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థులకు గోల్డ్ మెడల్

కాగజ్‌నగర్‌టౌన్: పరకాలలో క్రియేటివ్ కరాటే ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 32వ ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. కాగజ్‌నగర్ చాంపియన్ కరాటే స్కూల్, ఫాతిమా కాన్వెంట్ నుంచి ఆరుగురు విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. 5వ తరగతికి చెందిన కె.సాత్విక్, సాయి ప్రణయ్, పి.సాత్విక్, వివేక్ తేజ, బాలికల విభాగంలో బిందుష, ట్వింకిల్ రాయ్‌లు గోల్డ్ మెడల్ సాధించారు. డి.బిందుష స్పారంగి భాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించారు. వీరిని కరాటే మాస్టర్ ఎం.దేవయ్య, బి.రవి, ఫాతిమా కాన్వెంట్ ప్రిన్సిపాల్ సఫల్య అభినందించారు.

పరామర్శ

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన కంబాల సంతోష్, ఎలుకపెల్లి గ్రామానికి చెందిన జంగపల్లి బానయ్యలు ఆదివారం రాత్రి అనారోగ్య కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

కరెంట్ కష్టాలు..!



నూతనంగా నిర్మించుకున్న ఇళ్ల వద్ద బాధితులు

- విద్యుత్ కనెక్షన్లు లేక తిప్పలు
- దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోని అధికారులు
- ఖర్చులు భరించాలని సూచన
- ఇంటి పన్నులు కడుతున్నామంటున్న బాధితులు



బాధితుడు కడుతున్న ఇంటి పన్ను రశీదు

సిర్పూర్(టి): ఇళ్లు నిర్మించుకొని మూడేళ్లు గడుస్తున్నా విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో మండల కేంద్రంలోని కొత్తకాలనీ సమీపంలో గల సుమారు 20 కుటుంబాలకు చెందిన వారు తిప్పలు పడుతున్నారు. ఇళ్లల్లో కరెంట్ లేకపోవడంతో ఏళ్లుగా చీకటిలోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం లేదని అధికారులు కనెక్షన్లు ఇవ్వడం లేదు. నూతన లైన్ నిర్మాణానికి, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సుమారు రూ.70 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చవుతుందని, ఇందుకు ఇంటి యజమానులు డబ్బులు చెల్లించాలని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక ఇళ్ల యజమానులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇంటి పన్నులు చెల్లించినా..

కొత్తకాలనీలో నూతనంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని రెండేళ్ల నుంచి సిర్పూర్(టి) గ్రామపంచాయతీలో ఇంటి ట్యాక్స్‌లు చెల్లిస్తున్నా నూతన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడం ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్ నిర్మాణానికి కొత్త విద్యుత్ స్తంభాలు తీసుకొచ్చి సిద్ధంగా ఉంచినా విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతోనే కొత్తకాలనీలో కరెంట్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మూడేళ్లుగా..

మండల కేంద్రంలోని కొత్తకాలనీ సమీపంలోనే నూతనంగా నిర్మించుకున్న 20 ఇళ్లకు కరెంటు లేక మూడేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా చీకటిలోనే ఉంటున్నామని, వానాకాలంలో బురద, విషపురుగులతో తీవ్ర కష్టాలు పడుతున్నామంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కొత్త ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తకాలనీకి ఆనుకొని ఇళ్లు నిర్మించుకున్నాం. మూడేళ్లు గడుస్తున్నా ఇంటికి కరెంటు కనెక్షన్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కరెంటు లేక ప్రతీరోజు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

– నవ్‌గడె లలిత

కరెంట్ కనెక్షన్ ఇవ్వాలి



గ్రామపంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు కరెంట్ కనెక్షన్లు ఇవ్వాలి. ఓ ప్రైవేట్ వ్యక్తి నుంచి భూమి కొనుగోలు చేసుకొని ఇళ్లు నిర్మించుకున్నాం. అధికారులు స్పందించి కరెంటు కనెక్షన్లు ఇవ్వాలి.

– సాబెరా బేగం

డీడీలు చెల్లించాలంటున్నారు..



నూతన విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటి పన్నులు చెల్లిస్తున్నామని చెబుతున్నా నూతన లైన్, విద్యుత్ స్తంభాల ఏర్పాటు ఇతర ఖర్చుల కోసం డీడీలు చెల్లించాలని వేధిస్తున్నారు.

– మహ్మద్ సమీర్

ఘనంగా భీమదేవర పండుగ వేడుకలు

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం మన్నేవార్ (కొలవార్)ల ఆత్మ గౌరవ దినోత్సవం 23వ భీమదేవర జెండా పండుగ కార్యక్రమాన్ని మండలంలోని మన్నేవార్ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని భీమన్న ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించారు. ఆదివాసీ మన్నేవార్ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స కిష్టయ్య, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారిపెల్లి పోశం, జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి మెర్పల్లి సదాశివ్, కుర్మ రాజు, మండలాధ్యక్షులు ఎడ్ల భీమయ్య, సర్పంచులు సునంద, శారద, మండల నాయకులు డబ్బా బాపు, గోపాల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం భీమన్న దేవర జెండా పండుగను ఆదివాసీ మన్నేవార్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పెద్దల శంకర్, మాజీ సర్పంచ్ పెద్దల సుగుణ, స్థానిక ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, వీటీడీఏ ప్రెసిడెంట్ సంతోష్, పూజారి మేకల శ్రీనివాస్ పాల్గొన్నారు.



దహెగాంలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం మన్నేవార్ల ఆదివాసీ ఆత్మగౌరవ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివాసీ మన్నేవార్ల సేవా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జెండా ఎగురవేశారు. ఆదివాసీ సాంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు కోత్మీర్, బీబ్రా, హత్తిని, కుంచవెల్లి తదితర గ్రామాల్లో సోమవారం 22వ ఆదివాసీ (మన్నేవార్) జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో వచ్చి భీమదేవర వద్ద పూజలు నిర్వహించారు. పలువురు మన్నేవార్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల సాంప్రదాయాలను కాపాడాలన్నారు. నాయకులు తిరుపతి, రవి, మేకల మల్లేష్, హనుమంతు, శంకర్, నల్లి దామోదర్, సహకార సంఘం వైస్‌చైర్మన్ ధనుంజయ్, నాయకులు సురేశ్ పాల్గొన్నారు.



బెజ్జూర్: పూజలు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి

రెబ్బెన: తరతరాలుగా వస్తున్న ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలకు అందజేయాలని కోలావార్ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్గటి సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని పులికుంట, నంబాల, తుంగెడ, రేకులగూడ తదితర గ్రామాల్లో భీమన్న దేవుడి జెండా పండగ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. పులికుంట సర్పంచ్ బుర్స పోషమల్లు, గ్రామపెద్దలు టేకం భీమయ్య, గ్రామ అధ్యక్షుడు గువ్వల సత్య నారాయణ పాల్గొన్నారు.

అక్షింతల ఊరేగింపు

జిల్లాలోని పలు మండలాల్లో అయోధ్య అక్షింతలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కెరమెరి మండల కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. అశేష జన సందోహం మధ్య జరిగిన శోభాయాత్ర శ్రీ రాముని నామస్మరణతో మారుమోగింది. కలశాలను నెత్తిన పెట్టుకొని మహిళలు శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. చింతలమానెపల్లి మండలంలోని డబ్బా, చిత్తామ, బెజ్జూర్ మండలంలోని మర్తిడి, రెబ్బెన మండలం రాళ్లపేట, పెంచికల్‌పేట్ మండలంలోని కొత్తగూడ గ్రామాల్లో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

– కెరమెరి/చింతలమానెపల్లి/పెంచికల్‌పేట్/బెజ్జూర్/రెబ్బెన



కెరమెరి: కలశాలతో మహిళల ర్యాలీ



కెరమెరి: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: కొత్తగూడలో అక్షింతల పంపిణీలో పాల్గొన్న భక్తులు

'ప్రజాపాలన' దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్‌నుంచి సోమవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన అభయహస్తం దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలు, నూతన రేషన్ కార్డులు, పింఛన్ల కోసం వివరాల నమోదులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ నెల 6 నుంచి దరఖాస్తుల డాటా ను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 17వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వార్డుల వారీగా దరఖాస్తుల సంఖ్య, కులం, పుట్టినతేదీ, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే జిల్లాలోని రైస్ మిల్లర్లకు నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

జైనూర్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రాంనగర్(కాలేజిగూడ)లో తొడసం సీతారాం స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ముందుగా తొడసం సీతారాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల యువత క్రీడల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, హెచ్ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా తదితరులు ఉన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

లింగాపూర్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం చోర్‌పల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందజేస్తున్న సేవలు, అమలు చేస్తున్న పథకాలపై కళాజాత బృందం కళాకారులు మ్యాజిక్ షో, పాటల ద్వార ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్ మాన్సింగ్, సర్పంచ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న సేవలను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు దుగ్యాల సునీత, గోగికార్ నరేష్‌లు అన్నారు. సోమవారం రెబ్బెన శాఖ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం బ్యాంకు పథకాలపై మ్యాజిక్ షోలు, మాటలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు.

బుద్ధ విగ్రహానికి ప్రత్యేక పూజలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో నూతనంగా నిర్మించిన గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద సోమవారం నియోజకవర్గంలోని బౌద్ధ సమాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు బసార్కర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని అంబేద్కర్ భవన్ నుంచి నాగమ్మ చెరువులోని గౌతమ బుద్ధుడి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బౌద్ధ సమాజ్ సంఘం తాలుకా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతర, ఇతర కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. బౌద్ధ సమాజ్ సంఘం తాలుకా ఉపాధ్యక్షుడు పూల్జలే నామ్‌దేవ్, సమతా సైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జి జాడి దిలీప్‌కుమార్, బౌద్ధ సమాజ్ సంఘం మండల అధ్యక్షుడు నగ్రాడె రాజు, నాయకులు బండురావ్, సిరిపురం బాపు, డోంగ్రె లహాను, దుర్గం శ్యామ్‌రావ్, రాజారం, జయంత్, తిరుపతి, తులసీరాం, ప్రేమనందం, లలితాబాయి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బౌద్ధ సమాజ్ నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కౌటాల: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యావనరుల కేంద్రం ఎదుట కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ ఏడు నెలల నుంచి వేతనాలు, అల్పాహారం బిల్లులు రావడం లేదని, కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు శారదా, నాయకులు నాగేశ్, మోరేశ్వర్, హంస, పద్మా, లక్ష్మి, నిర్మల, కమల, తార, సింధుబాయి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

డార్ఫ్ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ

జైనూర్: ప్రతీ ఒక్కరు హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి సభకు తరలిరావాలని డార్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు మడావి మధురాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న మార్లవాయిలో వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో ప్రభుదయ, కుమ్ర విశ్వనాథ్, కమిటీ సభ్యుడు మండాడి లింగు తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎస్సై కొమురయ్య సోమవారం ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి, సర్పంచ్ కావ్య, హెచ్ఎం విజయనిర్మల పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్టీయూ సంఘం క్యాలెండర్‌ను ఎంఈవో సోమయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆవిష్కరించారు. స్థానిక విద్యావనరుల కేంద్రం ఎదుట టీయూటీఎఫ్ సంఘం క్యాలెండర్‌ను ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆవిష్కరించారు. నాయకులు రాజు, గణపతి, రమేశ్, రాంచందర్, ప్రసాద్, కవిత, రమాదేవి, శ్యాంరావు, శ్రీనివాస్, శివాజీ, సునీల్, తిరుపతి పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై కొమురయ్య

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వాముల ఇరుముడి

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో సోమవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన చేపట్టారు. అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజ్యలక్ష్మి